# సత్తుపల్లి ఏరియా స్ట్రక్చర్ కమిటీ సమావేశం

## ఏరియా ఉద్యోగుల సమస్యల పై చర్చించిన ఐఎన్టీయూసీ



సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు09(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సరికొండ వెంకటా చారి అధ్యక్షతన శనివారం స్ట్రక్చర్ సమావేశం జి.ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించారు.సత్తుపల్లి ఏరియా పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏరియా అధికారులతో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో ఐ.ఎన్.టి.యూ.సీ నాయకులు కోరారు.స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా సత్తుపల్లి జి.ఎం కార్యాలయంలో పర్సనల్ డిపార్ట్మెంట్ , ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ఏర్పాటు , ఉద్యోగులకు రెయిన్ కోట్లు పంపిణీ , కిష్టారం ఓసిలో అదనంగా రెస్ట్ షెల్టర్ , వాష్ రూమ్ ల ఏర్పాటు , డిస్పెన్సరీ ఆధునికరణ , స్టాఫ్ పెంపు , ఆర్వో ప్లాంట్ , పర్మనెంట్ టెలిఫోన్ ఏర్పాటు చేయాలని , జే.వి.ఆర్ సి.హెచ్.పి లో డస్ట్ నియంత్రణ , క్యాంటీన్ మెరుగుపరచుట మరియు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు.అదేవిధంగా గతంలో జరిగే స్ట్రక్చర్ మీటింగ్ అంశాలపై చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.జనరల్ మేనేజర్ సరికొండ వెంకటాచారి మాట్లాడుతూ ప్రాతినిధ్య సంఘం నాయకులు ప్రస్తావించిన పనులను పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం , బుధవారం , శుక్రవారం ఫైనాన్స్ , క్వాలిటీ , ఐటి , సర్వే డిపార్ట్మెంట్ల హెచ్.ఓ.డి లు మరియు మంగళవారం , గురువారం , శనివారం పర్సనల్ , ఐ.ఇ.డి , సెక్యూరిటీ , వివిధ డిపార్ట్మెంట్ల హెచ్.ఓ.డి లు అందుబాటులో ఉండే విధంగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేస్తుందని , ఇప్పటివరకు ఏ విధంగా ఉత్పత్తి లక్ష్యసాధనలో సహకరించారో ఇక ముందు కూడా సహకరించి సంస్థ పురోఅభివృద్ధిలో తోడ్పడాలని జనరల్ మేనేజర్ సరికొండ వెంకటా చారి కోరారు.ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు బొల్లం శ్రీనివాస్ ( ఎస్ ఓ టు జి.ఎం ) , ప్రహ్లాద్ ( ప్రాజెక్ట్ ఆఫీసర్ , జే.వి.ఆర్ ఓసి ) , సునీల్ వర్మ ( ప్రాజెక్ట్ ఆఫీసర్ , కిష్టారం ఓసి ) , శ్రీనివాస్ రావు ( ప్రాజెక్ట్ ఇంజినీర్ ) , సోమశేఖర్ ( ఏరియా ఇంజనీర్ ) , తిరుపతి ( పర్సనల్ ఆఫీసర్ ) , సాయి నాథ్ ( డీ.జీ.ఎం , జే.వి.ఆర్ సి.హెచ్.పి ) , ప్రదీప్ , రవి కుమార్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు , సివిల్ , ఐ.ఇ.డి డిపార్ట్మెంట్ ల అధికారులు , సంక్షేమ అధికారి శ్రీనివాస్ ఇతర డిపార్ట్మెంట్ల అధికారులు , ఐఎన్టీయూసీ ప్రాతినిధ్య సంఘం నాయకులు కోటేశ్వరరావు , క్రాంతి కుమార్ , నాగ ప్రకాష్ పాల్గొన్నారు.

# పేద విద్యార్థి కలకు కుంజ సూర్య అండ..

## అఖిల చదువుకు రూ.20 వేల చేయూత

### ఎన్ఐటీ వరంగల్ సీటు కోసం ఆర్థిక ఇబ్బందులు.. అఖిలకు అండగా నిలిచినా కాంగ్రెస్ పార్టీ నాయకులు

### చదువు ఆగకూడదంటూ ముందుకొచ్చిన కుంజ సూర్య.. అఖిల భవిష్యత్తుకు భరోసా







తెలుగు గళం ఏటూరునాగారం:

పేదరికం ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజ సూర్య మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామానికి చెందిన అనుమ నాగేష్--అరుణ దంపతుల కుమార్తె అనుము అఖిల తన ప్రతిభతో ఉన్నత విద్యలో సీటు సాధించినప్పటికీ, ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకుని ఆమెకు అండగా నిలిచారు. అఖిల తొలుత ఐఐటీ --జార్ఖండ్‌లో సీటు సాధించినప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఫీజు చెల్లించలేక ఆ అవకాశాన్ని కోల్పోయింది. అనంతరం రెండో దశలో ఎన్ఐటీ వరంగల్‌లో సీటు సాధించింది. అయితే ఈ అవకాశాన్ని కూడా ఆర్థిక ఇబ్బందుల కారణంగా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబ సభ్యులు రాత్రి సమయంలో దేవులపల్లి విజయకుమార్‌ను సంప్రదించి తమ పరిస్థితిని వివరించారు. విషయం తెలుసుకున్న దేవులపల్లి విజయకుమార్ వెంటనే స్పందించి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంజ సూర్యను సంప్రదించి అఖిల చదువుకు సహాయం చేయాలని కోరారు. స్పందించిన కుంజ సూర్య విద్యార్థిని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. అదేవిధంగా ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ రూ.10,000, పూజారి కిరణ్ కుమార్ యూఎస్ఏ, ఎన్ఆర్ఐ రూ.10,000 అందించడంతో మొత్తం రూ.40,000 ఆర్థిక సహాయాన్ని అఖిల కుటుంబానికి అందజేశారు. ఈ సహాయాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, దేవులపల్లి విజయకుమార్ చేతుల మీదుగా అఖిల కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఒక విద్యార్థి ప్రతిభకు పేదరికం అడ్డంకి కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని కోరారు. అఖిల ఎన్ఐటీ వరంగల్‌లో ఉన్నత విద్యను విజయవంతంగా పూర్తి చేసి, భవిష్యత్తులో మరెందరో పేద విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, జిల్లా యువజన ఉపాధ్యక్షుడు సర్వ అక్షిత్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు సోదారి రామయ్య, సర్పంచులు కావిరి అర్జున్, పొలబోయిన గోపాల్, ఈసం జనార్ధన్, ఉపసర్పంచ్ అనుము లక్ష్మయ్య, తాటి నీలాద్రి, జాడి రమేష్, సప్పిడి రాంబాబు, పొన్న వెంకటనారాయణ, చెన్న శ్రీనివాస్, అత్కూరి ఎల్లయ్య, నేతాజీ, సోదారి కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారంలో కొమురం భీమ్‌కు ఘన నివాళి అర్పించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు

### "జల్--జంగల్--జమీన్" కోసం కొమురం భీమ్ పోరాటం.. నేటి ఆదివాసీ తరానికి అదే స్ఫూర్తి!

### ఆదివాసీ హక్కుల పరిరక్షణకు బిఆర్ఎస్ అండగా నిలుస్తుంది: లక్ష్మణ్ బాబు





తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :

ఏటూరునాగారం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై-జంక్షన్ వద్ద ఉన్న ఆదివాసీ పోరాటయోధుడు, అమరవీరుడు కొమురం భీమ్ విగ్రహానికి ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ.. "జల్--జంగల్--జమీన్" నినాదంతో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయంపాలన కోసం కొమురం భీమ్ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అడవులు, భూములు, సహజ వనరులపై ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, హక్కులు మరియు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు మరియు యువతకు మెరుగైన అవకాశాల కోసం నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావాలని లక్ష్మణ్ బాబు కోరారు. ఆదివాసుల సంక్షేమం, అభివృద్ధి మరియు హక్కుల పరిరక్షణ కోసం బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కొమురం భీమ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఆదివాసీ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిస్తూ, ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాంత ప్రజలందరికీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజనుల హక్కుల పరిరక్షణకు చట్టపరమైన అవగాహన అవసరం

రంగశాయిపేట,తెలుగు గళం: గిరిజన ప్రజలు తమ హక్కుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి రాజ్ నిధి అన్నారు. ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా యాకుబ్ పుర, వరంగల్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ కాలేజ్‌లో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు గిరిజన ప్రజల హక్కులు, చట్టపరమైన రక్షణ, సమానత్వం, సామాజిక న్యాయం, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ.. గిరిజనుల హక్కులను కాపాడటంలో రాజ్యాంగం, చట్టాలు కల్పించిన రక్షణలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి, ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలియజేశారు.




# జైలు భరోను జయప్రదం చేయాలి:సీపీఎం"



సత్తుపల్లి/ కల్లూరు,ఆగస్టు09(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండలంలో గల తాళ్లూరు, వెంకటాపురం గ్రామాల సీపీఎం శాఖల సమావేశం నర్వనేని పుల్లయ్య భవన్ లో నాయుడు నాగార్జున, శాంతయ్య అధ్యక్షతన నిర్వహించారు. సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జయప్రదం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలియజేయాలని నాయకులు కోరారు. జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కమిటీ సభ్యుడు తన్నీరు కృష్ణార్జునరావు, రైతు సంఘం మండల కార్యదర్శి ముదిగొండ అంజయ్య పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో: శాఖా కార్యదర్శులు సోంబత్తిని కృష్ణ, రాజా రాములు, రవి, వెంకయ్య, రేసు నాగేశ్వరరావు, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి జైల్‌భరో కార్యక్రమానికి మత్స్యకారుల సంపూర్ణ మద్దతు

### తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తరాల చంద్రబాబు, కార్యదర్శి మునిగెల రమేష్




తెలుగు గళం న్యూస్ జనగామ ఆగస్టు 9

కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, మత్స్యకార వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమానికి తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జనగామ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.జిల్లాలోని మత్స్యకారులు, మత్స్య కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మునిగెల రమేష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా మత్స్యకారులు, మత్స్య కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మత్స్యకారుల జీవనోపాధికి రక్షణ కల్పించడం, చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు భద్రత కల్పించడం, మత్స్యకారులకు సంక్షేమ పథకాలు, ఉపాధి, సామాజిక భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే విధానాలను ఉపసంహరించుకుని, వారి హక్కులను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రమాదాల్లో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న బీమా సొమ్ము, ఎక్స్‌గ్రేషియా వెంటనే అందించాలని కోరారు. దేశవ్యాప్తంగా సముద్ర ప్రాంత, మైదాన ప్రాంత మత్స్యకారులకు వేర్వేరుగా ప్రత్యేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి, వాటికి బడ్జెట్ కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, మహిళా సంఘాలకు ప్రత్యేక రుణ సౌకర్యం అందించాలని కోరారు.మత్స్యకారుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని, ప్రజా ఉద్యమాల ద్వారానే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావచ్చని మునిగెల రమేష్ పేర్కొన్నారు.ఆగస్టు 10న జనగామ జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో నిర్వహించే జైల్‌భరో కార్యక్రమంలో మత్స్యకారులు, నాయకులు, మత్స్య కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జనగామ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

### కేసీఆర్‌కు ఘన స్వాగతం..

# ములుగు గడ్డపై బీఆర్ఎస్ శ్రేణుల జోష్!

### ఏటూరునాగారం నుంచి భారీగా తరలిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



తెలుగు గళం ఏటూరునాగారం:

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) పర్యటన నేపథ్యంలో ములుగు జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయడంతో పాటు, ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. జై కేసీఆర్.. జై బీఆర్ఎస్ నినాదాలతో ఏటూరునాగారం నుంచి మల్లంపల్లి వైపు బీఆర్ఎస్ కార్యకర్తలు ఉత్సాహంగా బయలుదేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని అన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర నిర్మాణం వరకు కేసీఆర్ అందించిన నాయకత్వం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ములుగు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లడం పార్టీ శ్రేణుల్లో నెలకొన్న ఉత్సాహానికి నిదర్శనమని అన్నారు. కేసీఆర్‌కు ములుగు జిల్లా ప్రజల తరఫున ఘన స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మండల స్థాయి నేతలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

